హైవే పై ట్రాఫిక్ జాం

- పనుల వల్ల గంటల పాటు నిలిచి ఉంటున్న వాహనాలు



నవతెలంగాణ-సదాశివనగర్

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం అవుతుంది. వందలాది వాహనాలు గంటల పాటు బారులు తీరుతున్నాయి. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి చౌరస్తా వద్ద జాతీయ రహదారి 44పై బ్రిడ్జి పనులు కొద్ది రోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం చౌరస్తాలో క్రేన్ సాయంతో సెంటర్ లైటింగ్ పనులు మార్చడంతో ట్రాఫిక్ స్తంభించింది.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | డిసెంబర్ 30, 2023 | www.navatelangana.com

రెండో రోజు పెరిగిన దరఖాస్తులు

నిజామాబాద్‌లో 75,508, కామారెడ్డిలో 33,854

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,60,144 దరఖాస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

ప్రజాపాలన సభల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండో రోజు శుక్రవారం దరఖాస్తుల సంఖ్య పెరిగింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 75,508 దరఖాస్తులు అందాయి. గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సభలలో 51,531 దరఖాస్తులు, మున్సిపల్ వార్డుల్లో 23,977 దరఖాస్తులు అందాయి. మొదటి రోజైన గురువారం 28వ తేదీన 28,868 దరఖాస్తులు, శుక్రవారం 29వ తేదీన 75,508 దరఖాస్తులు కలుపుకుని జిల్లాలో ఇప్పటివరకు మొత్తంగా 1,04,376 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. ఇక కామారెడ్డి జిల్లాలో శుక్రవారం 61 గ్రామ పంచాయితీలు, 80 మునిసిపల్ వార్డులలో ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తులు స్వీకరించారు. రెండో రోజు 33,854 దరఖాస్తులు అందాయి. గురువారం 21,914 దరఖాస్తులు అందిన విషయం విధితమే.

ఆధార్ సెంటర్‌లో అక్రమ వసూళ్లు



విచారణ చేపట్టిన ఆర్ఐ సాయిబాబా

- మార్పులు చేర్పులకు రూ.200-300 వసూళ్లు
- ప్రశ్నిస్తే.. టోకెన్‌లు లేవంటు బుకాయింపు

నవతెలంగాణ-బిచ్కుంద

గ్యారెంటీ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్న వేళ.. పలువురు వచ్చిందే తడవుగా అందిన కాడికి దండుకుంటున్నారు. ఇంటి అడ్రస్‌ల మార్పులు, చేర్పుల కోసం తదితర వాటి కోసం ఆధార్ కేంద్రానికి పలువురు పరుగులు పెడుతున్నారు. దీన్నే అవకాశంగా భావించిన పలు సెంటర్ నిర్వాహకులు ఏకంగా 200 నుంచి 300 రూపాయలు వసూలు చేస్తున్నారు. మార్పులు చేర్పులకు రూ.50 చెల్లించాల్సి ఉండగా.. దానికి నాలుగైదింతలు ఎక్కువగా వసూలు చేస్తున్నారు. ప్రశ్నించిన వారికి టోకెన్ అయిపోయాయనే సమాధానం చెప్తున్నారు.

బిచ్కుంద మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న ఆధార్ నమోదు కేంద్రంలో నిర్వాహకులు అక్రమవసులకు పాల్పడుతున్నారు. శుక్రవారం ఆధార్ నమోదు కోసం వచ్చిన ప్రజల నుంచి నిర్వాహకుడు ఒక్క వ్యక్తి నుంచి 200 వందల నుంచి 300 వందలు వసూలు చేసి డబ్బులు ఇచ్చిన వారికే టోకెన్లు ఇస్తు డబ్బులు ఇవ్వని మిగతా వారికి రేపు రండి ఎల్లుండి రండి అంటూ కాలయాపన చేస్తున్నారు. మిగతావారు మాకు టోకన్లు ఎందుకు ఇవ్వడం లేదని డబ్బులు ఇస్తున్న వారికే టోకెన్ ఇస్తావా అని ప్రజలు నిర్వాహకుని నిలదీశారు. గత మూడు నెలల క్రితం ఆధార్ నమోదు కోసం డబ్బులు తీసుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నాడని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్ ఐ సాయిబాబా విచారణ చేసి అక్రమ వసూలు చేస్తున్నట్టు నిర్వాహకుడు ఒప్పుకొని తిరిగి ఇలాంటి తప్పు చేయనని అధికారికి ఒప్పంద పత్రం రాసిచ్చాడు. అయినా నిర్వాహకునిలో ఎలాంటి మార్పు రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం అభయహస్తం ద్వారా నిరుపేదలకు ఐదు పథకాలు ఇస్తాము ప్రజా పాలనల కార్యక్రమంలో దరఖాస్తులు జనవరి 6 వరకు పెట్టు కోవాలని ప్రభుత్వం ప్రకటించడం, ఆధార్ కార్డు పథకాలకు అనివార్యం చేయడం వల్ల ఆధార్ కార్డులో పేర్లు తప్పులు, కొత్తవారు ఆధార్ కోసం అవసరం ఉన్న వ్యక్తులు ఆధార్ సెంటర్ లకు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా భావించిన బిచ్కుంద ఆధార్ సెంటర్ నిర్వాహకుడు ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. దీంతో వందల మంది ప్రజలు సెంటర్‌కు వచ్చి నిర్వాహకునికి నిలదీయడంతో పాటు రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్ పర్యవేక్షణ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆధార్ కేంద్రానికి వచ్చి ఆర్ఐ సాయిబాబా ప్రజలతో మాట్లాడి విచారణ చేయగా టోకెన్ల పేరుతో ఒక రోజు ముందు డబ్బులు తీసుకొని రోజుకు 30 మందికే ఆధార్ నమోదు చేస్తున్నాడని విచారణలో తేలింది. పై అధికారులతో మాట్లాడి ఆధార్ సెంటర్ ను సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు.

డబ్బులు ఇస్తేనే టోకెన్ ఇస్తున్నారు

శంకర్ (బిచ్కుంద)



ఆధార్ నమోదు కోసం వస్తే డబ్బులు ఇచ్చిన వారికే టోకెన్ ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వనిదే ఏ పని ఇక్కడ జరగడం లేదు. డబ్బులు ఇవ్వని వారికి రేపు ఎల్లుండి అని కాలయాపన చేస్తున్నారు. చివరకు విసిగిపోయి రెండు వందల రూపాయలు ఇచ్చి టోకెన్ తీసుకున్నాను. అధికారులు స్పందించి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి.



చంటి పిల్లాడితో ఆధార్ సెంటర్ వద్ద క్యూ కట్టిన పలువురు

ఆధార్ సెంటర్లకు క్యూ..

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణ జనవరి 6 వరకు గడువు ఉండడంతో ఆధార్ కార్డులలో పొరపాట్లను సరి చేసుకునేందుకు ప్రజలు ఆధార్ సెంటర్‌కు క్యూ కడుతున్నారు. భార్య ఆధార్ కార్డులో ఇంటి అడ్రస్ మార్పు కోసం లైన్‌లో ఉంటున్నారు. చంటి బిడ్డలను ఎత్తుకెళ్తు పనులకు సెలవు పెడుతూ మరి లైన్ కడుతున్నారు. ముఖ్యంగా ఆధార్ కార్డులలో ఇంటి అడ్రస్‌ల మార్పు కోసమే ఎక్కువగా ప్రజలు ఆధార్ సెంటర్ల వద్దకు వస్తున్నారని వివిధ ఆధార్ సెంటర్ యజమానులు తెలుపుతున్నారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డు ఇవ్వకపోవడంతో రేషన్ కార్డు కోసమే ప్రత్యేకంగా ప్రజలు ఎలాగైనా జనవరి 6 లోపు తమ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని విధంగా ఉదయం నుండి సాయంత్రం వరకు సైతం అధర్ సెంటర్ వద్ద క్యూ కడుతూ తమ పనులను నిర్వహించుకుంటున్నారు. పిల్లలకు ఇప్పటివరకు ఆధార్ కార్డు తీసుకుని వారు సైతం తమ పిల్లలను తీసుకొని వచ్చి లైన్లో ఉండడంతో పోలీస్ పహారాలో ఆధార్ సెంటర్లు కొనసాగుతున్నాయి.

ఫామ్ నింపితే 50..!

- దరఖాస్తుల వేళ.. దందా



నవతెలంగాణ-భిక్కనూర్

గ్యారెంటీ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం విధితమే. అయితే దీన్ని సైతం పలువురు దందాగా మలుచుకొని దరఖాస్తు ఫారాలు నింపుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫామ్‌కు ఏకంగా 50 రూపాయలు వసూలు చేస్తుండటం గమనార్హం.

ఈ నెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని గ్రామపంచాయతీల వద్ద కౌంటర్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం అందజేస్తున్న ప్రజా పాలన దరఖాస్తు ఫారాలను కావలసిన పథకాలను ఎంపిక చేసి పూర్తి వివరాలు దరఖాస్తులు వ్రాసి అధికారులకు ఇయాల్సి ఉంటుంది. చదువురాని వారు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అధికారులే దరఖాస్తు ఫారాలను రాసి ఇస్తున్నారు. అయితే దరఖాస్తు దారుల తాకిడి ఎక్కువగా ఉండటంతో దీనిని అదునుగా చేసుకొని దరఖాస్తు ఫారాల రాయడం రాని వారి నుంచి పలువరు వ్యక్తులు ఫారాలను నింపడానికి 50 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. దరఖాస్తు ఫారాలు తక్కువ రావడంతో ఫారంలు దొరకని వారి వద్ద నుండి కొందరు వ్యక్తులు ఫారాలను కూడా 30 నుండి 50 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అమాయక ప్రజల నుండి దరఖాస్తు నింపడానికి, ఫారాలను అమ్మి డబ్బులు వసూలు చేస్తున్న దళారుల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.


నేడు ఆయా గ్రామాల్లో ప్రజాపాలన సభ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని 93 గ్రామాలలో నేడు (శనివారం) ప్రజాపాలన సభలను నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తెలిపారు. డీపీఓ తెలిపిన ప్రకారం శనివారం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగనున్న గ్రామాల వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నియోజకవర్గం లోని జిజి.నడకుడ, నికాల్పుర్, బాద్గుణ, సీహెచ్.కొండూరు, షాపూర్, ఉమ్మెడ, మిర్దాపల్లి, రాంచందర్పల్లి, గోవింద్ పెట్, రాంపూర్, అంకాపూర్, ఇస్సాపల్లి, మదనపల్లి, సట్లపూర్ తండా, చెక్కి, వల్లభాపూర్ లలో ప్రజాపాలన సభలు నిర్వహించనున్నారు. అలాగే బాల్కొండ నియోజకవర్గం లోని బోదేపల్లి, వన్నెల(బి), ముచ్కూర్, సంతోష్ నగర్ తండా, పళ్ళికొండ, సుదర్శన్ నగర్ తండా, ముప్కాల్, బుస్సాపూర్, చాకిరియాల్, కోడిచెర్ల, సావెల్, దొంపాల్, మోర్తాడ్, బోధన్ నియోజకవర్గంలోని భూలక్ష్మి క్యాంప్, పెంటాకాలాన్, పెంటాఖుర్దు, పెంటాఖుర్దు క్యాంప్, నవీపేట్, స్టేషన్ ఏరియా, నాగేపూర్, పోతంగల్, వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండా, కందకుర్తి, సాటాపూర్, మందర్న, సాలంపాడ్, తానాకలాన్, ఎడపల్లి, అంబం(వై), ఏ.ఆర్.పీ క్యాంప్, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ పరిధిలోని చల్లగరిగా, ధనంబండతండా, బెలియాతండా, మరియతండా, అమృతపూర్, గొల్లపల్లి, బర్దీపూర్, ముల్లంగి(ఐ), డోన్కల్, జి.కె.తండా, సిర్నాపల్లి, స్టేషన్ తండా, మాదాపూర్, మునిపల్లి, నల్లగుట్ట తండా, సికింద్రాపూర్, న్యాల్కల్, సిర్పూర్, బాడ్సి, సింగంపల్లి, జలాల్పూర్, పాల్డ, చక్రధర్ తండా, గాంధీనగర్, జంగిలోడి తండా, నర్సింగ్ పల్లి, గుడిమెట్ల తండా, సర్పంచ్ తండా గ్రామాలలో, బాల్కొండ నియోజకవర్గంలోని హాసకొత్తూర్, కోనాపూర్, అమీర్ నగర్, చౌట్పల్లి, పడగల్, జానకంపేట్, బాన్సువాడ సెగ్మెంట్ లోని దేవునిగుట్ట తండా, కొత్తపల్లి, రాంపూర్, సుద్దులం, హంగర్గా, హంగర్గాఫారం, బొప్పాపూర్, చిక్కడపల్లి, శ్రీనగర్, వర్ని, హుమ్నాపూర్, నెహ్రూనగర్ గ్రామాలలో ప్రజాపాలన సభలు జరుగనున్నాయి.

బడిబయట పిల్లలు బడిలోకి..

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని గిద్దలో ఆంధ్ర నుండి వలస వచ్చి నివాస ముంటు, పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న పిల్లలను గుర్తించి స్కూల్లో చేర్పించినట్టు సీఆర్పీ మహమ్మద్ తెలిపారు. సర్వేలో భాగంగా శుక్రవారం గుర్తించి గిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కనకయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేర్పించారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్



మాట్లాడుతున్న మూడ్ శోభన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలోని మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్టులో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా అధ్యక్షులు ఎం గంగాధరప్ప అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి హాజరై మాట్లాడారు. డిసెంబర్ 4 నుండి 7 వరకు మీచౌంగ్ తుఫాను వలన రాష్ట్రంలో నాలుగు లక్షల 75 వేల ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లిందని, వరి, మొక్కజొన్న, మిరప, పత్తి పంటలకు పెద్ద ఎత్తున నష్టం చేకూరినట్టు తెలిపారు. ఈ తుఫాన్ వలన రైతాంగానికి రూ.3500 కోట్ల నష్టం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం వానాకాలంలో అతి వర్షాల వలన 12 లక్షల ఎకరాలు పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఎకరాకు పదివేల రూపాయలు పరిహారం చెల్లిస్తామని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన అందరికీ అందలేదు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా కేటాయించిన నిధులను కూడా రైతులకు పరిహారం కింద ఇవ్వలేదని అన్నారు. యాసంగి పంటలు సాగు చేయడానికి రైతు భరోసా నిధులను రైతులను ఖాతాలలో వేయాలని అన్నారు. 2 లక్షల రూపాయల రుణమాఫీ నిబంధనలు రూపొందించి ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో కౌలు రైతులకు రుణమాఫీని వర్తింప చేయాలని కోరారు. యాసంగి పంట రుణాలు రైతులకు ఇవ్వడానికి బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న, సోయా, పప్పు ధాన్యాలు కు బోనస్ కలిపి కనీసం మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని, సమగ్ర భూ సర్వే నిర్వహించి ధరణిలో ఉన్న లోపాలంటే సవరించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం 8 లక్షల 41 వేల ఎకరాలకు, 2 లక్షల 64 వేల కుటుంబాలకు హక్కుపత్రాలు అందించాలని కోరారు.

కుంగిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం తన వైఖరిని ప్రకటించాలని, మెడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులలో ఏర్పడిన లోపాల వలన రిపేర్లు జరిగే వరకు ప్రాజెక్టుల నుండి నీటిని పంపింగ్ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ప్రస్తుతం శ్రీరామ్‌సాగర్ నుండి దిగువకు నీరు రావడానికి తగినంత నీరు ప్రాజెక్టులో లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు టీ బుమాన్న, లక్ష్మను, దేవునూరి రాజన్న, నాగలక్ష్మి, పద్మ, గణపతి,సుశీల, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు లెక్కలు ఇవ్వకుంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- గడవుతేదీలోగా అభ్యర్థులందరూ సమర్పించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇటీవల జరిగిన రాష్ట్ర శాసన సభ-2023 ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలోని ఆయా సెగ్మెంట్ల నుండి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చు మొత్తాలను సరిచూసుకుని, అవసరమైన వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ సూచించారు. ఖర్చు లెక్కలు ఇవ్వకుంటే మూడేండ్ల పాటు ఎన్నికల బరిలో నిలిచేందుకు అర్హత కోల్పోతారని తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలను సరిపోల్చుకునేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్లో)లోని సమావేశ మందిరంలో శుక్రవారం రికన్సిలేషన్ నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు శక్తి, పాటిల్ చిన్మయి ప్రభాకర్ లు విచ్చేసి, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను, వ్యత్యాసాలను పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజువారీ ఖాతా రిజిస్టర్, నగదు లావాదేవీల రిజిస్టర్, బ్యాంక్ రిజిస్టర్, స్టేట్‌మెంట్ (పార్ట్-1 నుండి వరకు), షెడ్యూల్ లో 1 నుండి 11 వరకు గల ఎన్నికల ఖర్చుల వివరాలను సరి చూసుకుని సరైన క్రమసంఖ్యతో కూడిన అన్ని బిల్లులు, వోచర్లు, ఒరిజినల్ అఫిడవిట్, స్వీయ ధృవీకరణతో కూడిన బ్యాంకు స్టేట్‌మెంట్ తదితర వాటిని ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన 30 రోజులలోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. గడువు ముగియనున్న నేపథ్యంలో రికన్సిలేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యానర్స్, పోస్టర్స్, దినపత్రికలు, టీవీ ఛానల్ లో ఇచ్చిన యాడ్స్ వివరాలు, వాటికైనా ఖర్చుల వివరాలు కూడా తెలియజేయాలని సూచించారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సరైన రీతిలో ఖర్చుల వివరాలను సమర్పించేలా ఏఈఓలు మార్గనిర్దేశం చేస్తున్నారని అన్నారు. నిర్ణీత కాల వ్యవధిలోపు స్పందించని వారిపై ఆర్.పీ.చట్టం, 1951లోని సెక్షన్ 10 ప్రకారం అనర్హత విధించాలని కోరుతూ, ఎలక్షన్ కమిషన్ కు లేఖ పంపనున్నట్టు తెలిపారు. ఈ.సి ద్వారా అనర్హులుగా ప్రకటించబడిన వారు మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కోల్పోతారని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, ఆయా నియోజకవర్గాల నుండి పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు పాల్గొన్నారు.

చలాన్‌పై డిస్కౌంట్.. వినియోగించుకోవాలి

- ట్రాఫిక్ చలాన్ చెల్లింపు కౌంటర్ ప్రారంభించిన ప్రధాన న్యాయమూర్తి





కౌంటర్ ప్రారంభిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

నవతెలంగాణ-కామారెడ్డి

లోక్ అదాలత్ సందర్భంగా కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పోలీస్ శాఖ కామారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో ట్రాఫిక్ చలాన్‌ల చెల్లింపు కౌంటర్‌ను శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ఎన్. శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ చలాన్‌లకు డబ్బులు ఇక్కడ సులభంగా చెలించుకోవచ్చునని తెలిపారు. ఈ కౌంటర్ ద్వారా ట్రాఫిక్ చలాన్లు వేసిన దాంట్లో తగ్గింపుతో తీసుకుంటారని తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ ద్విచక్ర వాహనాల, త్రిచక్ర వాహనాలపై 100 శాతంలో 20 శాతం చెల్లింపు, తోపుడు బండ్లకు 100 శాతం లో 10 శాతం చెల్లింపు, 100 శాతం లో 40 శాతం, కార్, హెవీ వెహికల్స్ కి చెల్లింపు కొరకు జి ఒ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్ గౌడ్, అశోక్, నంద రమేష్, దామోదర్ రెడ్డి హాజరయ్యారు. న్యాయవాదులు సిద్ధ రాములు, నర్సింహారెడ్డి, న్యాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భుజంగరావు, కోర్టు సూపరింటెండెంట్లు వెంకట్ రెడ్డి, శ్రీధర్, చంద్రసేన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కబళించిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్



మృతిచెందిన అన్నదమ్ములు

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతిచెందిన విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రంలోని నర్సింగ్‌రావుపల్లి చౌరస్తాలో జాతీయ రహదారి 161పై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాగల్‌గావ్ గ్రామానికి చెందిన గణేష్, సంగ్రామ్ ఇద్దరు అన్నదమ్ములు. మండలంలోని కొడిపల్లిలోని ఇటుకబట్టిలో వారు పనిచేస్తున్నారు. సంగ్రామ్ పని నిమిత్తం తన సొంత ఇంటికి నాగల్‌గావ్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సంగ్రామ్, అతని తమ్ముడు గణేష్ వారితో పాటు మరో మిత్రుడు ముఖేడ్ గ్రామానికి చెందిన మదన్‌ను తీసుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. గురువారం అర్ధరాత్రి జాతీయ రహదారి 161 నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావు పల్లి చౌరస్తా వద్ద రాగానే దారి తెలియక రాంగ్ రూట్లో వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో గణేష్, సంగ్రామ్ అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. మదన్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేష్ సంగ్రంకు భార్య ముగ్గురు పిల్లలున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఘటన స్థలానికి ఎస్సై చేరుకొని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- నిప్పంటించుకోవడంతో ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- కుటుంబ కలహాలతో మనస్తాపం

నవతెలంగాణ-మోపాల్



చికిత్స పొందుతున్న రాజు

కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్ సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పుపెట్టుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో పోలీసులు మంటలు ఆర్పి తమ వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన కోహిల్కర్ రాజు (45) స్థానికంగా ప్రవేట్ వాహనాన్ని నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గొడవలు కారణంగా భార్య అతనికి మూడేండ్లుగా దూరంగా ఉంటుంది. అయితే శుక్రవారం రోజు తన కూతురు పెళ్లి జరగనుండగా.. తన అంగీకారం లేకుండానే పెండ్లి చేస్తున్నారని తీవ్ర కలత చెందాడు. దీంతో పోలీస్ స్టేషన్ సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది తక్షణమే స్పందించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాప్రాయం తప్పింది. నలభై శాతం వరకూ అతని శరీరం కాలిపోయిందని ప్రాణాపాయం లేదని వారు తెలిపారు.

సీఐ వెంకట నారాయణ, ఎస్సైహెచ్ఓ గంగాధర్ అతని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సంప్రదించగా ఎవరు కూడా సమాధానం ఇవ్వలేదు. రాజు ప్రాణాపాయ స్థితిలో ఉంటే కూడ దగ్గర వాళ్ళు ఎవరు కూడా ఆసుపత్రికి రాకపోవడం గమనార్హం. స్థానిక సీఐ వెంకట నారాయణ దగ్గరుండి వైద్య సదుపాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు.

ఆస్పత్రి నుంచి పడి ఒకరు మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని పడి ఒకరు మృతిచెందారు. ఈ ఘటన శుక్రవారం వెలుగుజూసింది. ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలానికి చెందిన అంబర్‌సింగ్(44)కు మూర్ఛ రావడంతో బుధవారం జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. గురువారం ఆస్పత్రిలో ఒకటో అంతస్తు వద్ద ఉండగా మూర్ఛవ్యాధి రావడంతో ప్రమాదవశాత్తు కిటికిలో నుంచి కిందపడ్డాడు. దీంతో మెరుగైన వైద్యం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య మలావత్ స్వాతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

2
నవతెలంగాణ
నిజామాబాద్
శనివారం | డిసెంబర్ 30, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్యేను సన్మానించిన మాదిగ సంఘం సభ్యులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండల కేంద్రంలోని ఎస్సీ మాదిగ సంఘం సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాట్‌పల్లి నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొప్పరి వినోద్, సంఘం సభ్యులు నట్ట శాలు, పైడి మహేందర్, బండారి గంగాధర్, గోట్టు ముక్కుల బుజ్జి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు నమోదు సెంటర్లను పెంచాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని ఆధార్ కార్డు అప్డేట్, నూతన కార్డుల నమోదుకు ఆధార్ సెంటర్లను పెంచాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.నరసింహ రెడ్డి అన్నారు. పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిటి విజయ్ కాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు ఉదయం తొమ్మిది గంటల నుంచి క్యూ లైన్‌లో వేచి ఉంటున్నారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్‌కార్డు సెంటర్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు ధ్యాగ ఉదయ్, మోహన్‌రెడ్డి, హరికృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి, దంత పరీక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్
సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిజామాబాద్ మేయర్ దండు నీతు కిరణ్ సహకారంతో ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు కండ్ల అద్దాలను, దంత సమస్యలతో బాధపడుతున్న వారికి దంత పరీక్షలు నిర్వహించారు. మేయర్ దండు నీతూకిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని బాగా చదువుకోవాలని, స్కూల్‌కు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. మానవ శరీరంలో కన్ను, పన్ను అతి ముఖ్యమైనదని, ప్రతి ఒక్కరూ వీటి విషయంలో జాగ్రత్త వహించాల్సిందిగా విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ నుంచి వినోద్, ప్రశాంత్, అప్తలమిక్ శ్రీకాంత్, డాక్టర్ నితీష్‌కుమార్, తిరుమల డెంటల్ కళాశాల సిబ్బంది, స్కూల్ హెచ్‌ఎం వాసుదేవరావు, రామచంద్ర గైక్వాడ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌పీలో చేరిన 36 కుటుంబాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్
బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పిలో ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన 36 కుటుంబాలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్పీ జిల్లా కార్యాలయంలో వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలో 93శాతం బహుజన ప్రజలకు రాజ్యాధికారం దక్కినప్పుడే సకలజనుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, జిల్లా ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, నాయకులు టి.రాజు, సహదేవ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాల విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-ఆర్మూర్
ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన 67వ ఎస్జిఎఫ్ఐ తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ అండర్17 సాఫ్ట్‌బాల్ పోటీలకు పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి అమానాఖాన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు సిల్వర్ మెడల్ అభినందన పత్రాన్ని శ్రీ గంగామోహన్ (అసోషియేషన్ జనరల్ సెక్రటరీ- సాఫ్ట్‌బాల్) అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మీనాజ్ మాట్లాడుతూ.. పిల్లలు చదువులోనే కాదు క్రీడాస్ఫూర్తిని, నైపుణ్యాలను మెరుగుపరుచుకొని అత్యున్నత స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విజయ్ కర్తన్, పిఈటి గంగాధర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

ఏర్గట్లలో శివ మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

నవతెలంగాణ-ఏర్గట్ల
మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి శివ మార్కండేయ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయని సంఘం సభ్యులు తెలిపారు. శనివారం 30వ తేదీన గణపతి పూజ, ధ్వజారోహణ, ఆదివారం 31న రుద్రమహా యాగములు, సామూహిక కుంకుమార్చన, 2024 జనవరి 1న ఉదయం 9 గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణం, అన్నదానం ఉంటుందని సంఘం సభ్యులు తెలిపారు.

కొత్త సంవత్సరం వేడుకల్లో జాగ్రత్త వహించాలి

- అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జయరాం వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్
కొత్త సంవత్సరం వేడుకలపై పోలీస్ శాఖ సూచించిన విధంగా నియమ నిబంధనలను పాటించాలని అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జయరాం సూచించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మత్తులో రోడ్లపై వేగంగా, ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులు కాకూడదని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా.. అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఇండ్లపై 33కేవీ వైర్లను తొలగించాలి

- ఎలక్ట్రిసిటీ ఎస్.ఈ రాజేందర్‌కి సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-కంఠేశ్వర్
రోటరీనగర్ ఇండ్లపై 33కేవీ వైర్లను తొలగించాలని ఎలక్ట్రిసిటీ ఎస్ఈ రాజేందర్‌కు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. 7వ డివిజన్ పరిధిలోని రోటరీనగర్ వాసుల ఇండ్లపై తేలిలాడుతున్న 33 కేవి వైర్లను తొలగించి 60 ఫీట్ల రోడ్డు మీదుగా వైర్లను షిఫ్ట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా రోటరీ నగర్ శాఖ కార్యదర్శి నల్వాల నరసయ్య మాట్లాడుతూ.. ఇండ్లపై 33 కెవి వైర్లు తేలియాడడం వలన అనేకమంది షాక్‌లకు గురై మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది మృత్యువాతకు గురవుతున్నందున ఇండ్లపై ఉన్న వైర్లను షిఫ్ట్ చేయాలని విన్నవించారు. దీనికి ఎలక్ట్రిసిటీ అధికారులు సానుకూలంగా స్పందించి సర్వే చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో శాఖ నాయకులు కేతావత్ నెహ్రూ, రాజు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ముప్కాల్
శాలివాహన (కుమ్మరి) సంఘం దేవాలయ కమిటీ ముప్కాల్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ శిఖర ప్రతిష్ట మహోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని దేవాలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల జనవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. 3న మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కులమతం ఉండదు

- అన్నీ సమానమే

నవతెలంగాణ-డిచ్‌పల్లి/మోపాల్
మానవులంతా సమానులేనని, వర్గం, కులం, మతాలు భేదం లేకుండా దైవం కారణ జన్ములయిన యేసు క్రీస్తు సందేశాలే మార్గదర్శకత చూపుతాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ దుస్తులను పంపిణీ చేశారు. పలువురు చర్చి ఫాస్టర్లు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. క్రైస్తవులకు కాంగ్రెస్ పార్టీకి అవినాభావ సంబంధం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని దీవించారన్నారు. విభజించి పాలించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం కాదన్నారు. ప్రతి వ్యక్తికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

యేసు క్రీస్తు నడిపిన ప్రేమ మార్గం సత్యం అహింసా మార్గములలో అందరం నడువాలని కోరారు. గత పది ఏళ్ల కాలంలో అధికారంలో ఉన్న బిఆర్‌యస్ పార్టీ, ఎస్సీ ఎస్టీ, బిసి, మైనారిటీ కళాశాల గురుకులాలు ఏర్పాటు చేసి యువకులను కులాల వారిగా వర్గాల వారీగా విడగొట్టారన్నారు. కేవలం కులాల ఓట్ల కొరకే పాలన కొనసాగించి పబ్బం గడిపారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా పేదలకు ఇండ్లు, భూములు పంచలేదని విమర్శించారు. అనంతరం గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డివో రాజేంద్రకుమార్, తహసీల్దార్ రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటిపల్లి నాగేశ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు అమృతాపూర్ గంగాధర్, శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, శాంసన్, పోలసాని శ్రీనివాస్, ధర్మగౌడ్, భిక్షపతి, మోత్కురి నవీన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల..
మోపాల్: మండలంలోని న్యాల్కల్ గ్రామంలో గల మాసాని చెరువు దగ్గర నిజాంసాగర్ నీటిని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రతి గుంటకు కూడా నీళ్లు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, శేఖర్ గౌడ్, మోపాల్ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, కిరణ్‌రావు, సర్పంచ్ గంగాప్రసాద్, ఉప సర్పంచ్ సతీష్, బున్నే రవి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా

నవతెలంగాణ-ఎడపల్లి
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానికులు పెట్టుకున్న దరఖాస్తులను సంబంధిత ఆయాశాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె సైతం అర్జీదారుల జాబితాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క



అధికారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు క్షుణంగా పరిశీలించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నివేదికలు మండలస్థాయికి వెళ్ళినప్పుడు సంబంధిత మండల నోడల్ అధికారితో పాటు గ్రామ ప్రత్యేక అధికారి ఇంటింట తిరుగుతూ.. అర్హులైన వారి జాబితాను పరిశీలించి వారికి న్యాయం చేకూర్చేలా చూడాలని అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమానుల షరీఫ్, ఎడపల్లి వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, ఎడపల్లి ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, ఈజీఎస్ ఏపిఓ వాణిశ్రీ, స్థానిక అంగన్వాడీ టీచర్లు, అధికారులు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం
ఇందూరు యువత

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్
మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం.. ఇందూరు యువత అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 12వ వార్షికోత్సవ వేడుకలను హృదయ స్పందన 2023 పేరిట శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, విశిష్ట అతిథిగా పార్లమెంటు సభ్యులు అరవింద్ ధర్మపురి, గౌరవ అతిథిగా ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఆత్మీయ అతిథిగా డా.ప్రతిమారాజ్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దానికి ముందు జిల్లా కేంద్రానికి చెందిన సాయి దేవిక అనే అమ్మాయి అనారోగ్య పరిస్థితి రీత్యా ఆమె కుటుంబానికి చేయూతగా రూ.45000 ఆర్థిక సహకారం అందించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు మరువలేనివి అందరికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. తాను ఆ సంస్థలో భాగస్వామిగా ఉండటం గొప్ప విషయమన్నారు. మనశ్శాంతి కోవెల ఆశ్రమానికి సహకారం అందిస్తానని తెలిపారు. ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ.. 12 ఏండ్ల ఈ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలకు నిజమైన గుర్తింపు ఈ రోజు లభించిందన్నారు. తన సహకారం ఎప్పుడు అవసరముందన్న నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నుంచి ప్రతి ఒక్కరు నేర్చుకోవలసింది చాలా ఉందని మానవతా విలువలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి ఉందన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. అనంతరం అతిథుల చేతులమీదుగా కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, దారం గంగాధర్, సూమీల శర్మ, స్రవంతిరెడ్డి, కాసుల సాయితేజ, వాల బాలకిషన్, సుభాష్ పద్మ, వినయ్‌కుమార్, సుజాతరెడ్డి, పుష్పవతి, జగన్మోహన్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్
రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, టి.ఎస్.ఎన్.పిడి.సి.ఎల్ నిజామాబాద్ ఏ.డి.ఈ తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. తోట రాజశేఖర్ 79వ సారి రక్తదానం చెయ్యగా ఆయన స్ఫూర్తితో 23 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ.. రాజశేఖర్ తన 57వ జన్మదినాన్ని పురస్కరించుకొని 79వ సారి రక్తదానం చెయ్యడం యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. అలాగే రక్త నిల్వలు కొరతను తీర్చేందుకు యువకులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగస్తులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు.


రక్తదానం చేస్తున్న దృశ్యం

రెడ్ క్రాస్ తరుపున ప్రతి నెలకు సుమారు 350 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా తలసేమియా పిల్లలకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదాత తోట రాజశేఖర్ మాట్లాడుతూ.. రక్తదానంతో ఎలాంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురుకావని మరింత ఆరోగ్యవంతంగా తయారవుతామని పేర్కొన్నారు. రక్తదానం చేయకున్నా 120రోజులకు ఒకసారి రక్త కణాలు నశిస్తాయని అందుకే ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలువాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ అరుణ్ బాబు, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయ కర్త డా.అబ్బాపూర్ రవీందర్, డివిజన్ వైస్ చైర్మన్ మురళి కృష్ణ, విద్యుత్‌శాఖ ఏ.ఈ ఆర్.సుమిత, డి.శ్రీనివాస్, ప్రణయ్, సంయోద్దీన్, ఎడపల్లి మండల వైస్ చైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిఐ రామన్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్
ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐయస్‌ఆర్ డి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామన్‌ను సన్మానించారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన ఆరుగుగు వ్యక్తులను హత్యచేసిన నిందితులను చాకచాక్యంగా పట్టుకుని ఈ కేసును చేదించిన సీఐ రామన్‌ను సిబ్బందిని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిదులు అమృత రాజేందర్, సంతోష్,సంజీవ్ శివాజీ రావు అభినందించారు.



ప్రజా పాలన ప్రారంభించిన జడ్పీటీసీ

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని పలుగ్రామల్లో శుక్రవారం ప్రజాపాలనను జడ్పీటీసీ కమిలి నర్సింలు ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే శుక్రవారం అమర్లబండ, దర్మారావుపేట్, వజ్జపల్లి, దగ్గి గ్రామాల్లో గ్రామసభ, దరఖాస్తుల స్వీకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హిమబిందు, వడ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ పరికరాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎలక్ట్రానిక్ నిపుణులు

నవతెలంగాణ-బోధన్
మండలంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) విద్యార్థులు పారిశ్రామిక క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం బోధన్ పట్టణంలోని జీవన్ ఎలక్ట్రానిక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ నిపుణులు ఎలక్ట్రానిక్ వస్తువులపై, వాటి పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల వొకేషనల్ టీచర్ శాంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అంశాలపై అవగాహన కల్పించేందుకు పారిశ్రామిక క్షేత్ర పర్యటన నిర్వహించినట్టు తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఎలక్ట్రికల్ వస్తువులు ఎలా పనిచేస్తాయి, వాటి పనితీరు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణ కోర్టుకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హాజరయ్యారు. పట్టణంలోని అంగడిబజారు మడిగేలను లబ్ధిదారులకు మున్సిపాలిటీ వారు పంపిణీ చేయకపోవటంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పంపిణికి ప్రయత్నించడంతో పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఆ కేసులో రెండు పర్యాయాలు కేసుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించుకున్నారు. ఈ కేసులో నాయకులు కోలా వెంకటేష్, మీర్ మాజీద్, విట్టం జీవన్, మీసాల రవి, కిషన్, హబీబ్, ఉస్మాన్, వెంకటి, మందుల పోశెట్టి, బబ్లు, ఉన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

- పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్



నవతెలంగాణ-ఆర్మూర్
మేడ్చల్ జిల్లాలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని మృతిపై విచారణ జరిపించి శ్రీ చైతన్య కళాశాల గుర్తింపును రద్దు చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో గల శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న వర్షా అనే విద్యార్థి మృతి పై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరుతూ శుక్రవారం సత్య ఒకేషనల్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల యాజమాన్యం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కేవలం డబ్బులే లక్ష్యంగా విద్యార్థిని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య కళాశాలపై పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిన అధికారులకు ప్రభుత్వానికి ఏ మాత్రం చీమకుట్టినట్టు లేదని అన్నారు. కార్యక్రమంలో ఏరియా ప్రధాన కార్యదర్శి డి.నిఖిల్, నాయకులు మహేష్, చందు, బీరుగొండ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన లో భాగంగా ప్రజల నుండి స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో, ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం స్వచ్ఛందంగా 6 గ్యారంటీలను అమలు చేయనున్నదని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డిపేట్, రామారెడ్డి లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజా సమస్యలపై కేంద్రాల వద్ద ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకున్న ప్రతి సమస్యపై కేంద్రాల వద్ద అధికారులకు వినతి పత్రం అందించవచ్చని సూచించారు. స్థానిక ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కల్లూరి రగోతం రెడ్డి, కిషన్ యాదవ్, రాజయ్య, కుమ్మరి శంకర్,బీజేపీ నాయకులు గోపు గంగారాం, పంచాయతీ కార్యదర్శులు అరవింద్ రెడ్డి, నరేష్, రవి, రాములు, అంగన్వాడి టీచర్లు పద్మజ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకాల అమలు కోసం డోంగ్లి మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని సద్వినియోగం పరుచుకోవాలని డోంగ్లి తహసీల్దార్ రేణుకచౌహాన్ సూచించారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 28, 29 తేదీల్లో డోంగ్లి, మొగలో గ్రామసభలు నిర్వహించినట్టు తెలిపారు. నేడు 30న లింబూర్, హసన్ టాక్లి, జనవరి రెండున మాదన్ హిప్పర్గా, ఇలేగావ్, మూడున మారేపల్లి, ధోతి, నాలుగున కుర్లా, ఐదున ఎనబోరా, మల్లాపూర్, ఆరున సిర్పూర్, పెద్ద టాక్లి, ఈ విధంగా ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా ఆరు గ్యారెంటీలు అమలు కోసం గ్రామాల వారీగా ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కార్మిక, ఉద్యోగుల సమస్యలపై

మ్యానిఫెస్టో హామీలను అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



కార్మిక ఉద్యోగుల సమస్యలపై మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో సీఐటీయూ జిల్లా కమిటీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్ మాట్లాడారు. ప్రధానంగా 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ జీఓలను సవరించడం, విడుదలైన 5 జీఓలకు గెజిట్ జారీ చేయడం, కనీస వేతనం రూ.26,000/-లు అమలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వివిధ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న ఈ సిబ్బందిని పర్మినెంట్ చేయడం, సమాన పనికి- సమాన వేతనం అమలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన 2వ పిఆర్సిని వెంటనే ఖరారు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఐఆర్ను, పిఆర్సిని అదే తేదీ నుండి అమలు చేయడం, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి సామాజిక భద్రత చట్టాలను అమలు చేయడం, స్థానిక సంస్థల్లో పనిచేసే గ్రామ పంచాయితీ, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీంతో పాటు పలు రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అందుకు అనుగుణంగా కార్మిక సంఘాలతో నూతన ముఖ్యమంత్రివర్యులు సమావేశమై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నే సాబ్, మోహన్ కొండ గంగాధర్ గణేష్, శోభ స్వప్న సరితా పుష్ప శ్రీనివాస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

3 కోట్ల 60 లక్షలతో ఉపాధి పనులు

- ప్రజావేదికకు హాజరైన ఆర్డీవో సాయన్న



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలో 2022-04-01 నుంచి 2023-03-31 వరకు వివిధ గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా నిర్వహించిన పనులపై మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రోజు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 25 గ్రామపంచాయతీలలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై గత వారం రోజుల నుండి సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన పనులపై తనిఖీ నిర్వహించారు. శుక్రవారం రోజు ప్రజా వేదిక నిర్వహించి గ్రామాల్లోపల పనులలో జరిగిన అవకతవకలపై వివరించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ సాయన్న మాట్లాడుతూ నాగిరెడ్డిపేట మండలంలో సంవత్సర కాలంలో మూడు కోట్ల 60 లక్షల పనులు నిర్వహించినట్టు తెలిపారు. గతంతో పోల్చుకుంటే ఉపాధి హామీ పనులలో చాలా తక్కువ మంది పనిచేసినట్లు వెల్లడించారు. ప్రతి నెలకొకసారి మాస్టర్లు పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ఆన్లైన్లో పని కోరిన వెంటనే వారికి పని కల్పించాలని సూచించారు. గ్రామాలలో ముఖ్యంగా కాలువలలో పూడికతీత పనులు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని కూలీలకు కూడా గిట్టుబాటు కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ రామ్, నారాయణ, డిఆర్ఓ నారాయణ, హెచ్ ఆర్ కల్పనతో పాటు నాగిరెడ్డిపేట్ ఎంపీపీ రాజదాస్, జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, ఎంపీడీవో రఘు, ఎంపీఓ శ్రీనివాస్, ఈసీ మధు, సాయిలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొరం టిప్పర్ స్వాధీనం

నవతెలంగాణ-కామారెడ్డి

మొరమ్‌ను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు కామారెడ్డి తహసిల్దార్ శ్వేతా శుక్రవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా, కామారెడ్డి మండల పరిధిలో అక్రమంగా జరుగుతున్న మొరం తవ్వకాలపై, తరలింపు పై ఇప్పటివరకు ప్రత్యక్షంగా ఏ తహసీల్దార్ టిప్పర్‌ను పట్టుకున్న దాఖలాలు లేవు. తాజాగా పట్టుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టుకున్న వాహనంపై కేసులు ఏమైనా నమోదు చేశారా అని వివరణ కోరగా.. ఆమె స్పందిస్తూ శుక్రవారం ప్రజా పాలన తనిఖీలో భాగంగా కామారెడ్డి మండలంలోని షాబ్దిపూర్ గ్రామం వైపు వెళ్తుండగా ఎదురుగా మొరంతో వస్తున్న టిప్పర్ వాహనాన్ని గమనించామని, అనుమానం వచ్చి వాహనంలో ఉన్న మొరం తరలింపునకు పర్మిషన్ ఉందా లేదా అని విచారణ కోసం షాబ్దిపూర్ గ్రామానికి తరలించినట్లు ఆమె తెలిపారు.

అక్రమాలపై ఉక్కుపాదం మోపేనా..?

గత బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అక్రమం చేసినా అధికార పార్టీ నాయకుల నుండి ఫోన్ రావడం దాన్ని వదిలేయడం శరమామూలుగా జరుగుతూ ఉండేదని ఆరోపణలు. ఎవరైనా ఇది ఏమిటనీ ప్రశ్నిస్తే ప్రశ్నించిన వారిపై దాడులు జరిగిన సందర్భాలు సైతం ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఇలాంటి అక్రమాలు జరగకుండా అధికార పార్టీ నాయకులు అధికారులకు సహకరిస్తారా లేదా అనేది వేచి చూడవలసిందే ? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బ్యాంకు మేనేజర్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ ఆర్య రాజు పై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు లింగంపేట్ ఎస్సై ప్రభాకర్ తెలిపారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపేట మండలంలోని పోల్కంపేట్ గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య అనే రైతు ఆగస్టు మాసంలో మృతి చెందాడు. మృతి చెందిన రైతు ఖాతాలోని ఈనెల 26న గుట్టుచప్పుడు కాకుండా ఇతరులు ఖాతా నుండి డబ్బులు డ్రా చేయడంతో గురువారం బ్యాంకు వద్ద బాధిత కుటుంబీకులు, రైతులు బ్యాంక్ సిబ్బంది మేనేజర్ తీరుపై ఆందోళనకు దిగి ధర్నా నిర్వహించారు. తలారి కిష్టయ్య ఖాతా నుండి డబ్బులు ఎవరు డ్రా చేశారని బ్యాంకు మేనేజర్ ను సిబ్బందిని నిలదీశారు. రెండు గంటలపాటు ఆందోళన కొనసాగింది. తలారి కిష్టయ్య ఖాతా నుండి డబ్బులు డ్రా చేసిన విషయంపై అతని కుమారుడు సాయిబాబా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని లింగంపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలం లోని పోల్కంపేట్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తలారి పోచయ్య మృతిచెందగా కుటుంబానికి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ దత్త ఆశ్రమం తరుపున డాక్టర్ వెంకట్ ఆదేశానుసారం గ్రామానికి చెందిన ఎస్ఎంసి చైర్మన్ ఆర్కారి ఆగమయ్య బాధిత కుటుంబానికి 5000 వేలు ఆర్థిక సహాయం అందించారు. అధైర్య పడొద్దని ఆశ్రమం తరుపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మా నాగరాజు, ఉపసర్పంచ్ రామానుజా చారి, యాదగిరి, నరేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేస్తున్న విద్యాధికారి దేవి సింగ్

నవతెలంగాణ-పిట్లం

స్కూల్లో పిల్లలకు మధ్యాహ్నం రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి దేవి సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజనం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కూరగాయలు సాంబార్ తో కూడిన వేడి ఆహారమును విద్యార్థులకు అందించాలని అన్నారు. వంట గది, పాత్రలను పరిసర ఆవరణంలో పరి శుభ్రత పాటించాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు రమణారావు , గణేష్ రావు , సిబ్బంది , క్లస్టర్ రిసోర్స్ పర్సన్ హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పిట్లం మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి ఏజెన్సీ వారికి రుచికరమైన ,నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారావు, గణేష్ రావు మరియు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ హైమాద్ పాష ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ట్రైనర్ చీకోటి బాలచందర్

నవతెలంగాణ-నిజాంసాగర్

పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల ముఖ్యంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 10 జీపీఏ రావాలంటే అందరూ చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని మోటివేషనల్ ట్రైనర్ చీకోటి బాలచందర్, కోమలంచ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రామ్‌చందర్ సూచించారు. నిజాంసాగర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని తొమ్మిది, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం చికోటి బాలచందర్ గోల్ సెట్టింగ్ మెమొరీ టెక్నిక్స్, సాఫ్ట్ స్కిల్స్, భవిష్యత్తులో ఉన్నత స్థానంలోకి రావాలంటే ఏమి చేయాలి తదితర అంశాలపై శుక్రవారం మోటివేషనల్ తరగతులను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు లో నేను ఒక డాక్టర్ ను, ఇంజనీర్, లాయర్, టీచర్‌ను అవుతానని కలలు కనాలని, ఆ కలలు సాధించేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, విజయ్, వెంకటి, సంఘమిత్ర, శైలజ తదితరులు పాల్గొన్నారు.

శత్రువుల పట్ల క్షమగుణం కలిగి ఉండాలి

- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమా గుణం కలిగి ఉండాలని యేసుక్రీస్తు ప్రభోదించారని, దీనిని ప్రతి ఒక్కరు అనుసరించాలని కామారెడ్డి మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందు ప్రియ అన్నారు. క్రిస్టమస్ వేడుకలలో భాగంగా శుక్రవారం శాబ్దిపూర్ లోని మహోన్నత చర్చిలో కామారెడ్డి నియోజక వర్గానికి సంబంధించి అధికారికంగా ఏర్పాటు చేసిన క్రిస్టమస్ కానుకల పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు మంచి నడవడికతో అడుగులు వేయాలని, మీ వెంట నేనుంటానని, ప్రపంచానికి వెలుగునిస్తానని ఏసుక్రీస్తు చెప్పారని అన్నారు. ప్రతి పేదవాడు పండుగలను సంతోషంగా జరుపుకొనాలనేదే ప్రభుత్వ ఆశయమని, అందుకనుగుణంగా నిరుపేద క్రిస్టియన్ సోదర,సోదరిమనులకు క్రిస్మస్ సందర్భంగా చర్చిల ద్వారా ఈ నెల 24 న గిఫ్ట్ ప్యాక్ లు అందించామని, నేడు వారికి విందు ఏర్పాటు చేశామని అన్నారు.

కామారెడ్డి ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విభిన్న మతాలు, సంస్కృతులకు ఆలవాలమైన భారత దేశం శాంతి, సామరస్యాలకు ఆలవాలంగా ఉండడం పట్ల ప్రపంచమే నివ్వెరపోతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవదాన్ పాస్టర్ థామస్, జోసెఫ్, ఇతర పాస్టర్లు, సి.డబ్ల్యూ.సి. సభ్యులు స్వర్ణలత, తహశీల్దార్ శ్వేత, క్రిస్టియన్ సోదర, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

- ప్రభుత్వ లక్ష్యం అదే : ఆర్.డి.ఓ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మాచారెడ్డి





దరఖాస్తు ఫారంను అందజేస్తున్న ఆర్‌డిఓ, ప్రజాపాలన సదస్సు కౌంటర్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఆర్.డి.ఓ శ్రీనివాస్ రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని కుటుంబాలకను గుణంగా సిబ్బందిని ఉంచడం, దరఖాస్తు ఫారాలు అందజేస్తుండటంతో పాటు ఫారం భర్తీకి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని వారి సహాయంతో భర్తీ చేసిన ఫారాల వెంట రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు సమర్పించి రసీదు పొందాలని ప్రజలకు సూచించారు. ఏ పథకాలకు అర్హులో ఆ పథకాలకు టిక్ చేస్తూ ఒక కుటుంబం నుండి ఒక దరఖాస్తు సమర్పిస్తే సరిపోతుందని ప్రజలకు వివరించారు.

అనంతరం కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని స్థానిక తహశీల్దార్ లత పరిశీలించి లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. గూడెం లో 423 గృహాలున్నాయని, అభయహస్తం కు అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో డిపిఓ సాయిబాబా, తహసీల్దార్ శ్వేత, ఉపతహసీల్దార్ కిష్టయ్య, సర్పంచు స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

మద్నూర్: మద్నూర్ మండలంలో మద్నూర్, చిన్న ఎక్లారా, గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల ప్రజా పాలన గ్రామసభలు అధికారులు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమాలకు నోడల్ అధికారి జెడ్పి సీఈవో సాయగౌడ్, స్పెషల్ ఆఫీసర్ శేఖర్ రావు, కార్యక్రమాలను పరిశీలించారు. మద్నూర్‌లో జరిగిన ప్రజా పాలన గ్రామసభ మండల అభివృద్ధి అధికారి రవిశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా చిన్న ఎక్లార గ్రామంలో జరిగిన గ్రామసభ మండల తాసిల్దార్ ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మద్నూర్ సభలో ఆర్ ఐ శంకర్, సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్ ఎంపిటిసి, పంచాయతీ పాలకవర్గం సభ్యులు పంచాయతీ కార్యదర్శి సందీప్ ఇతర గ్రామాల నుండి విధుల్లో ఆయా గ్రామాల గ్రామ కార్యదర్శులు అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు ఇతర శాఖల అధికారులు అదేవిధంగా చిన్న ఎక్లారాలో ఆ గ్రామ సర్పంచ్ భీమ్రావు పంచాయతీ సెక్రెటరీ పంచాయతీ పాలకవర్గం సభ్యులు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ రెండో రోజు కొనసాగింది నాగిరెడ్డిపేట మండలంలో అక్కంపల్లి, వదలపర్తి, వెంకంపల్లి, గోలి లింగాల్ గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి సంబంధిత శాఖ అధికారులు వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజధాని జెడ్పిటిసి మనోహర్ రెడ్డి సర్పంచ్లు బండ లక్ష్మి ప్రవీణ్. సుభకర్రెడ్డి మురళి తోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలిగించకుండా దరఖాస్తులు తీసుకోవాలి

భిక్కనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రజాపాలన సదస్సులు జిల్లా అడిషనల్ కలెక్టర్ మను చౌదరి శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన సదస్సు కౌంటర్లను పరిశీలించారు. ఇప్పటివరకు కౌంటర్ల ద్వారా తీసుకున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని ప్రజా పాలన సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసినా కౌంటర్లలో ప్రజలు దరఖాస్తులు ఇచ్చె విధంగా చూడాలని, రేషన్ కార్డు లేని వారి కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో అనంతరావు, పట్టణ సర్పంచ్ వేణు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పిట్లం: మండలంలోని తిమ్మానగర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆరు గ్యారెంటీలకు గాను ఏర్పాటుచేసిన కౌంటర్లలో పెద్ద ఎత్తున తమ దరఖాస్తులను అందజేయడం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అంగన్వాడి , పంచాయతీ సెక్రటరీలు, ఆశా వర్కర్లు ప్రజల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామ్మోహన్ రావు , ఎంపిఓ బ్రహ్మం , ప్రజా ప్రతినిధులు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి , ఎన్ఎస్‌యుఐ జుక్కల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పల్లె శివప్ప, మల్లెపల్లి సంతోష్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



విరాళం అందజేత

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన సంత నడిపి రాజేశ్వర్ మల్లవ్వ దంపతులు ఆలయ నిర్మాణానికి తమవంతు సహాయంగా రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం విరాళం మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం అందజేసిన సంత నడిపి రాజేశ్వర్ మల్లవ్వ దంపతులకు అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, చింత గణేష్, అయ్యప్ప మాలధారణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శనివారం | డిసెంబర్ 30, 2023 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భీంగల్



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

పట్టణ కేంద్రానికి చెందిన జీఎస్ ఫోర్ఎస్ సొసైటీ అధ్యక్షుడు పిల్లోల గంగస్వామి చెంగల్ గ్రామానికి చెందిన ఎనుగందుల నర్సు కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఎనుగందుల నర్సు భర్త చనిపోవడంతో తన నలుగురు కూతుర్లతో కలిసి అద్దె ఇంటిలో నివాసం ఉంటోంది. ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడుతూ జీవనం సాగిస్తున్న విషయాన్ని తెలుసుకున్న గంగస్వామి శుక్రవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసి వారికి ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తామని భరోసా కల్పించారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పకడ్బందీగా సభలు నిర్వహించాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అర్హులైన వారికి ఆరు గ్యారంటీల ద్వారా లబ్ది చేకూరుస్తూ, ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శుక్రవారం మండలంలోని ధర్మారం(బి)లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంచిన అప్లికేషన్లు, వారి వద్ద నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులను



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అభయహస్తం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలని, దరఖాస్తులను పూరించే విషయంలో ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. షామియానా, మంచినీటి సౌకర్యం కల్పించడం, దరఖాస్తులు నింపడానికి ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కులు, దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాపాలన సభలలో దరఖాస్తులు సమర్పించేందుకు వస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ చిన్న ఫిర్యాదుకు సైతం ఆస్కారం ఇవ్వకుండా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని హితవు పలికారు. సభకు హాజరయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉన్న పక్షంలో అందుకు అనుగుణంగా కౌంటర్ల సంఖ్యను పెంచాలని, సరిపడా దరఖాస్తులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎవరు కూడా మీ సేవ సెంటర్లు, జిరాక్స్ సెంటర్ల నుండి డబ్బులను వెచ్చించి దరఖాస్తులు కొనుగోలు చేయకూడదని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మెప్మా ఆర్.పీల ద్వారా ప్రతి నివాస ప్రాంతంలో దరఖాస్తులను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజాపాలన సభలలోనూ వీటిని ఉచితంగా అందించడం జరుగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని పథకాలకు కుటుంబం నుండి ఒకే దరఖాస్తు ఇస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. గ్రామ సభల వద్ద హెల్ప్‌డెస్కులు అవసరం మేర పెంచాలని, ఒకవేళ ఏదేని కారణాల వల్ల గ్రామసభ రోజు దరఖాస్తు చేయని వారు జనవరి 6లోగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తును అందజేయవచ్చని, దరఖాస్తులు సమర్పించిన వారికి తప్పక రసీదు ఇవ్వాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట మెప్మా పీ.డీ రాజేందర్, తహసిల్దార్ రాజేందర్, ఎంపిడిఓ టీవీఎస్ గోపి బాబు, ఎంపిఓ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ పత్తి మమత అనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ఉపాధి హామీలో జరిగిన పనుల అభివృద్ధి వివరాలపై శనివారం బోధన్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్టు మండల ప్రజాప్రతినిధులు ఉదయం 9 గంటలకు ప్రజావేదిక సభకు హాజరు కావాలని ఎంపీడీఓ పర్సన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్ప ఆలయం వద్ద అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో అయ్యప్ప విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం అవధూత దత్త పీఠం ఆస్థాన విద్వాంసులు, బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరణ్ శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల సమక్షంలో అయ్యప్ప విగ్రహ ప్రతిష్టాపన, మహాపూర్ణవతి కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య మంగళ విగ్రహ దర్శనములు, శాంతి కళ్యాణం, భక్తజనులకు పండితులచే ఆశీర్వచనం కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులకు ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంకాలం దివ్య పదునెట్టాంబడి మహా పడిపూజ, నక్షత్ర జ్యోతి దర్శనం వేలాది మంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా అధిక సంఖ్యలో మహా పడిపూజను తిలకించారు.

మలావత్ రమేష్ నాయక్‌కు బయోటెక్నాలజీలో పిహెచ్‌డి ప్రదానం



మలావత్ రమేష్‌కు పిహెచ్‌డి పట్టా అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి మాలవత్ రమేష్‌నాయక్‌కు శుక్రవారం పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేశారు. మలావత్ రమేష్ నాయక్ కాంబినేటోరియల్ స్ట్రాటజీస్ ఫర్ ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ రూట్ నాట్ నెమటోడ్ ఇన్ఫెస్టేషన్ ఇన్ టర్మరిక్ అనే అంశంపై డాక్టర్.బలేని మహేందర్ పర్యవేక్షణలో ఈ పరిశోధన నిర్వహించారు. ఈ కార్యక్రమ ఫైనల్ వైవాకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా హాజరైన కర్ణాటక హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్‌చంద్ర పరిశోధన సమాచారాన్ని రాబట్టి పిహెచ్డి పట్టా ప్రదానం చేశారు. బయోటెక్నాలజీవి విభాగాధిపతి డాక్టర్ జవేరియా ఉజ్మ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ సిహెచ్.ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, డాక్టర్.కిరణ్మయి, డాక్టర్ ప్రసన్న శీలా, పిహెచ్‌డి పరిశోధక, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను అందరూ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ కైలాస్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను అందరు వినియోగించుకోవాలని లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలు ప్రజలు సంక్షేమ పథకాలకు నోచుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల బాధలను అవస్థలను అర్థం చేసుకొని ప్రజల వద్దకు పాలన కోసమే ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఆరో తారీకు వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కలీం, ఎంపీఓ యూసుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వినాయక రెసిడెన్సి అపార్ట్‌మెంట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నారాయణరెడ్డి, క్యాషియర్‌గా నర్సయ్య, సెక్రటరీగా సత్యం రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంకు అపార్టుమెంట్ వాసులు, కౌన్సిలర్‌లు ఇట్టెడి నర్సారెడ్డి, పొద్దుటూరి మురళీధర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

యూనివర్సిటీలో 'సాక' గ్రంథావిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో జంబూ సాహితీ వేదిక, తెలుగు అధ్యయనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో దళిత కథా వార్షిక 2022 'సాక' గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలుగు అధ్యయనశాఖ ప్రొఫెసర్ డాక్టర్ పి.కనకయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ప్రముఖ కథా రచయిత గుడిపల్లి నిరంజన్, విశిష్ట అతిథులుగా ప్రముఖ సాహిత్య విమర్శకులు, పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి



గ్రంథాన్ని ఆవిష్కరణలో పాల్గొన్న పలువురు

శ్రీనివాస్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, అతిథులుగా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ బిఒఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.త్రివేణి, విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కె.లావణ్య, సాక సంపాదకులు డాక్టర్ సిద్దెంకి యాదగిరి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ పి.కనకయ్య మాట్లాడుతూ.. ఎవరి అస్తిత్వ చైతన్యాన్ని వారు మాత్రమే రికార్డ్ చేసుకొంటే నిష్పక్షపాతంగా, స్వచ్ఛంగా ఉంటుందన్నారు. డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సింహాలు తమ చరిత్ర తాము రాసుకోకపోతే వేటగాడు చెప్పిన పిట్ట కథలే చరిత్ర అయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఇతర విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో బ్లూ కలర్ డే సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెంటిల్ కిడ్స్ పాఠశాలలో బ్లూడే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లతా బ్లూ డే ప్రాముఖ్యతను తెలిపారు. బ్లూ డే నిజాయితీ, నమ్మకానికి, విశ్వాసానికి, జ్ఞానానికి ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు. ఈ సందర్భంగా బ్లూ కలర్‌లో ఉన్న వివిధ రకాల వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పిల్లలు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ లయన్ గుజరాతి, ప్రకాష్ అందరూ బ్లూ కలర్ దుస్తులలో కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



జెంటిల్ కిడ్స్ పాఠశాలలో సంబరాలు జరుపుకుంటున్న చిన్నారులు

ఉపాధిహామీ పనుల అవకతవకలపై ఆగ్రహం

నవతెలంగాణ-కోటగిరి

గత వారం రోజుల నుంచి 2022-23కు సంబంధించి ఉమ్మడి మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో పనులను సిఆర్పి కుమార్ ఆధ్వర్యంలో గ్రూపుల వారీగా పరిశీలించి గురువారం ప్రజావేదిక కార్యక్రమంలో తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం ఉపాధి కూలీలకు నష్టం కలిగించింది. పోతంగల్, సోంపూర్ గ్రామాలలో గ్రామపంచాయతీ కార్మికులు ఉపాధి పనులు



మాట్లాడుతున్న పిఆర్పి కుమార్

చేసినట్లు తెలపడంతో అధికారులు అవాక్కయ్యారు. ఎత్తొండ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనుల పట్ల అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులు ఫీల్డ్ అసిస్టెంట్ల వారికి అనుకూలమైన వారికి ఉపాధి పనులు కల్పించినట్లు సిఆర్‌పి ప్రజావేదికలో తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డి ఎపిడి చందర్ నాయక్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఏపీవో గంగారం, ఆయాగ్రామాల కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేపట్టాలి

నవతెలంగాణ-బోధన్



బోధన్ నియోజ కవర్గంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా గతంలో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్దిదారులకు చెక్కులను పంపిణి చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు రామకృష్ణ శుక్రవారం బోధన్ ఆర్డిఓ కార్యాలయ పాలనాధికారి విఠల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ మూలంగా ఆ చెక్కులు పంపిణీ చేయనందున వాటిని తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరారు. అలాగే గతంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను పరిశీలించి తొందరగా మంజూరు చేయించాలని కోరారు.

ఖానాపూర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఖానాపూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వస్త్రియ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యురాలు రుఖాన షాహిన్ తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకై తల్లులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రజిని, దానము, జ్యోతి, అంగన్వాడీ సూపర్వైజర్ వెంకట రమణమ్మ అంగన్వాడీ టీచర్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలో చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాదవ్‌నగర్ సాయిబాబా మందిరంలో హుండీ లెక్కింపు



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాదవ్‌నగర్ సాయిబాబా మందిరంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సుప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. కాగా మూడు లక్షల 51,357 ఆదాయం వచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా మందిరం కార్యనిర్వహణ అధికారి శ్రీరామ్, రవీందర్, అర్చకులు మాణిక్య శర్మ, రామకృష్ణ, హరికృష్ణ, సిబ్బంది ఎ.హరితరాణి, కె.లలిత, కె.సంతోష్‌కుమార్, కె.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ బహుకరణ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ కేజీబీవీ పాఠశాలకు శుక్రవారం ముప్కాల్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు నునుగొండ అంజయ్య కంప్యూటర్‌ను వితరణగా బహుకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సైతం పాఠశాల కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నల్ల జ్ఞానసాగర్‌రెడ్డి, కనకయ్య గౌడ్, కబడ్డీ గంగాధర్, పుష్పనాథ్, పాఠశాల ఎస్వో వినోద, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న అంజయ్య

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు, గతంలో వాహనాలపై విధించిన పనులను చెల్లించలేని వారు వన్ టైం సెటిల్మెంట్‌లో భాగంగా వసూలు చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఆరోగ్య సంస్థ సేవలు అనిర్వచనీయం

- మేయర్



ఉపాధ్యాయులు, విద్యార్థులతో మేయర్ నీతుకిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సూర్య ఆరోగ్య సంస్థ సేవలు అనిర్వచనీయమని మేయర్ దండు నీతు కిరణ్ తెలిపారు. శుక్రవారం సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఉర్దూ మీడియం స్కూల్ వెంగళరావునగర్‌లోని విద్యార్థులకు, నిజామాబాద్ నగర సహకారంతో ఉచిత కంటి పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులకు మేయర్ దండు నీతూ కిరణ్ సహకారంతో ఉచితంగా కండ్ల అద్దాలను, దంత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం మేయర్ దండు నీతూ కిరణ్ మాట్లాడుతూ.. మానవ శరీరంలో కన్ను, పన్ను అతి ముఖ్యమైనదని ప్రతి ఒక్కరూ వీటి విషయంలో జాగ్రత్త వహించాల్సిందిగా విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ సీఈవో సూర్య తేజ, సూర్య భగవాన్, సిఒఓ రాజేంద్రకుమార్ విక్రమ్, వినోద్, ప్రశాంత్ అప్తలమిక్ శ్రీకాంత్, డాక్టర్ నితీష్ కుమార్ తిరుమల డెంటల్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడపాకల్ విద్యార్థులకు మరో అరుదైన గౌరవం



విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మరో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా)వారు గత వారం నిర్వహించిన అమ్మ,నాన్న,గురువు శతక పద్య ధారణ పోటీలలో పాల్గొన్న సుమారు 19 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలు పంపడంతో వాటిని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావేద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దిన తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ కృషి గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, నాగప్ప, రాములు, కృష్ణప్రసాద్, గంగాధర్, నరేందర్, సుజాత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ఆరుగురు హత్యలకు గురైన ప్రసాద్ కుటుంబాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సురేష్ నాయక్, స్థానిక నాయకులు నరేష్‌గౌడ్, అనిల్ కుమార్ కులకర్ణి, నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గురుకులాల సమన్వయకర్త సంపత్ కుమార్ శుక్రవారం ఒక తెలిపారు.2024-25 విద్యా సంవత్సరానికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. వివరాలకు .%ష్ట్రజు: 7/స్త్ర ఎవ్.ఎస్త్రప్ర.ఖఅ% వెబ్ సైట్ ను పరిశీలించాలని, వచ్చే జనవరి 6 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్ష 2024 ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి 1 వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుపై కొట్టివేతలుండొద్దు

• సూచించిన అధికారులు • రెండోరోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

అభయహస్తంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో శుక్రవారం రెండోరోజు చేపట్టారు. అందులో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులపై కొట్టివేతలు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : మున్సిపల్ పరిధిలోని ప్రజలు ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి అన్నారు. బోధన్ పట్టణంలోని 7,9,11 వార్డులలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిరుపేదలు ప్రభుత్వం ద్వారా ఏ సంక్షేమ పథకం అవసరమో దానిని దరఖాస్తు ఫారంలో రాసి ఇవ్వాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డిప్యూటీ ఈఈ శివానందం, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, పౌల్, అఖిల్, ఫారుఖీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కౌంటర్ల పరిశీలన..

రెంజల్ : మండల కేంద్రం రెంజల్‌తో పాటు బాగేపల్లి గ్రామాలలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. మండలంలోని ప్రజాపాలన ఏ విధంగా కొనసాగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు ఫారంపై ఎలాంటి కొట్టివేతలు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గ్రామ కార్యదర్శులు రాజేందర్‌రావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలపై ఎంపీడీవో శంకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన రెంజల్ రైతు వేదికలో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ అధ్యక్షతన ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నీల గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ గౌరాచి లలితా రాఘవేందర్ అధ్యక్షతన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

బాగేపల్లి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారెంటీ పథకాలపై తహసీల్దార్ రామచందర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్ ఉద్దీన్, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీఎం భాస్కర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి గోపికృష్ణ, స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్, సాయిబాబా గౌడ్, రామ కార్యదర్శి శ్రీకాంత్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి..

ఎడపల్లి (యాడ్ వార్త) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సభ్యులు చేసుకోవాలని సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామపంచాయతీ సమీపంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదల కొరకు ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నందున దరఖాస్తుదారులు తొందరపడకుండా వచ్చేనెల 8వ తేదీ వరకు గ్రామపంచాయతీలోనే దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎస్సై విక్రమ్, ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు..

ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎడపల్లి మండల ప్రజా పరిషత్ సీనియర్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కుర్నపల్లి గ్రామపంచాయతీ ఆవరణంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిమ్మపల్లి మహేష్‌గౌడ్, ఎంపీటీసీ రామిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి రాహుల్, బిల్‌కలెక్టర్ పాండు, అధికారులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, కల్పన, సంజన, గంగామణి మంజుల, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలి..

కోటగిరి : మండలంలోని కోటగిరి, ఎక్లాస్‌పూర్, దేవునిగుట్ట తండా తదితర గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాలకు అనూహ్య స్పందన ఏర్పడింది. ప్రజలు స్వచ్ఛందంగా పలు పథకాలకు సంబంధించి అర్హులైన వారు అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ఎక్లాస్‌పూర్ గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమంలో కొత్తపల్లి విండో అధ్యక్షులు వెనిగళ్ళ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. వారితోపాటు అధికారులు తహసీల్దార్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు గంగాధర దేశాయ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

బోధన్ : ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభలను బోధన్ మండలంలోని ప్రతి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బోధన్ తహసీల్దార్ గంగాధర్ అన్నారు. బోధన్ మండలంలోని పెగాడపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలను పొందడానికి మీకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో రాసి ఇవ్వాలని అన్నారు. దరఖాస్తులకు ఎలాంటి చివరి తేదీ లేదని ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. దళారులు, మధ్యవర్తులు మాటలు నమ్మి ఆర్థిక ఇబ్బందులు పడవద్దని సూచించారు. ప్రజలు వారికి కావలసిన సంక్షేమ పథకాలను దరఖాస్తు ఫారంలో రాసి గ్రామపంచాయతీలో అందజేయాలని సూచించారు. మండలంలోని లంగ్డాపూర్, మినార్‌పల్లి, నాగన్‌పల్లి, హూన్సా, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలలో సర్పంచులు శంకర్, పవన్, చీల గంగమ్మ, తూము అంజమ్మ, గ్రామపెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండవ రోజు కొనసాగిన ప్రజా పాలన..

భీంగల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం రెండవ రోజు మండలంలోని తాళ్లపల్లి, రహత్‌నగర్, దేవక్కపేట్, కొత్తతండా గ్రామ పంచాయతీలలో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులు తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో రాజేశ్వర్ ఆయాగ్రామాల సర్పంచులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అలాగే మున్సిపల్ పట్టణ కేంద్రంలో ప్రత్యేక అధికారి విజయ్ కుమార్, చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ గంగామోహన్, ఏపీఎం కుంట శ్రీనివాస్, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను పరిశీలించిన ఆర్డిఓ రాజేందర్

జక్రాన్‌పల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. సర్పంచ్ చంద్రకళ బాలకిషన్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇన్చార్జి ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామస్థాయి, మండలస్థాయి అధికారులు అందరూ హాజరై దరఖాస్తులను స్వీకరించారు. నిజామాబాద్ ఆర్డిఓ రాజేందర్ ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని దరఖాస్తులు ఏ విధంగా స్వీకరిస్తున్నారో పరిశీలించి తగు సూచనలను చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఓ బ్రహ్మానందం, కాంగ్రెస్ నాయకులు వినోద్, మండలస్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ప్రజా పాలన గ్రామసభ (ఫోటో రావాలి)

కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపటినటువంటి ఆరు గ్యారెంటీలకు సంబంధించి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్దిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వం అభయహస్తం 6 గ్యారంటీ అమలులో భాగంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ రెడ్డి, మండల స్పెషల్ ఆపిసర్ యోహాన్, ఎంఇఓ ఆంద్రయ్య, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు మైలారం గంగాధర్, మండలస్థాయి అధికారులు, డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు విజయ, రూప, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, లబ్దిదారులు, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం రశీదులు అందజేత..

ఏర్గట్ల : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీలు అమలుకు అభయహస్తం కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏర్గట్ల ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్ చేతుల మీదుగా రశీదులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రశీదులు తీసుకున్న వారు వాటిని భద్రంగా ఉంచుకోవాలని, అవి దరఖాస్తుదారుని రుజువు అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుండ నవీన్, ఉపసర్పంచ్ తాహెర్, ఎంపీఓ శివ చరణ్, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల స్వీకరించాలి..

నవీపేట్ : ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరించాలని ఆర్‌డిఓ రాజాగౌడ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్ (ఎం), కోస్లి గ్రామాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. దరఖాస్తులో భాగంగా కౌంటర్ల వద్ద సిబ్బందిని పలు సూచనలు చేశారు. ఆరు గ్యారెంటీలతో పాటు రేషన్ కార్డు, రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను సైతం ప్రత్యేకంగా ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన సదుపాయాలు సమకూర్చినట్టు తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ ధన్వాల్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఆర్‌ఐ మోహన్, సర్పంచ్‌లు నీలేష్ కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన..

డిచ్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని నిజామాబాద్ డివిజన్ ఆర్డిఓ రాజేంద్ర కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి, గంగారాం తండా, మల్లాపూర్, లోలం గ్రామాలలో గ్రామ సభలను పలు చోట్ల ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే జనవరి ఆరో తేదీ వరకు గ్రామాలలో గ్రామసభలు కొనసాగుతాయని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులు తీసుకుంటున్న తీరును నిశితంగా పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. పలు వివరాలను మండల నోడల్ అధికారి రాములు నాయక్, తహసీల్దార్ వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు చెన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చింతల కిషన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడానికి ప్రజలు నుండి దరఖాస్తులను ఆహ్వాని స్తోందని, అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు పథకాలు అమలు చేసి చూపామని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీ తప్పకుండా నేరవేర్చుతామని వారన్నారు. అనంతరం ప్రజల చేత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి చింతల దాస్, ఎంపిఓ రాజ్ కాంత్ రావు, పిఆర్ ఎఈ కిషన్, కార్యదర్శులు శ్రీధర్, డి.సింగోటం, ఎపిఓ పోశెట్టి, ఎపిఎం సువర్ణ, ఆర్‌ఐ నరేష్, లక్ష్మారెడ్డి, విమలాబాయి, వ్యవసాయ అధికారులు ప్రకాష్, ఎండి శ్రీనివాస్, సాయిలు, పండరి, సతీష్, కరోబార్ నరేందర్, శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు రఘునథన్ రాము, మమతా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బోధన్ : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ తూము పద్మావతి


రెంజల్ : ప్రజాపాలనపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శంకర్

ప్రజాపాలన దరఖాస్తు ఫారాల విక్రయాలు..

నవతెలంగాణ-బోధన్

బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాలలో ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను పలు ఆన్లైన్ కేంద్రాల నిర్వాహకులు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు రూ.10 చొప్పున దరఖాస్తు ఫారాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామసభలు ప్రజల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం ఉచితంగా ఫారాలను అందిస్తుంది. కానీ మండలంలోని పలు గ్రామాల ఆన్లైన్ కేంద్రాల నిర్వహకులు, జిరాక్స్ సెంటర్ల నిర్వహకులు నిరక్షరాస్యుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఒక్కొక్క ఫారాన్ని 10 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిసింది. దరఖాస్తు ఫారాలను గ్రామపంచాయతీ వారు ఉచితంగా అందిస్తారని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో గ్రామస్తులకు ఆ సమాచారం చేరడం లేదు. దాంతో జిరాక్స్ సెంటర్లను, ఆన్లైన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. దాంతో జిరాక్స్‌లకు దరఖాస్తు ఫారాలకు డబ్బులు వెచ్చిస్తూ నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగంగా దరఖాస్తు ఫారాలను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. కొంతమంది జిరాక్స్ సెంటల్ నిర్వాహకులు దరఖాస్తు ఫారాలను జిరాక్స్ చేసి అందిస్తున్నట్లు పలువురు పేర్కొన్నారు. జిల్లాలో కుటుంబాల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం సరిపడా దరఖాస్తు పత్రాలను ఆయా గ్రామాలకు పంపిణీ చేశారు. అయినా జిరాక్స్ సెంటర్ నిర్వాహకులు జిరాక్స్‌లు చేస్తూ నిరక్షరాస్యులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. అధికారులు తక్షణమే స్పందించి ఆన్లైన్ కేంద్రాలలో, జిరాక్స్ సెంటర్లలో తనిఖీలు చేపట్టాలని ప్రజా పాలన దరఖాస్తు ఫారాలను విక్రయించకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


ఎడపల్లి : వడ్డేపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీధర్


ఏర్గట్ల : అభయహస్తం రశీదులు అందజేస్తున్న ఎమ్మార్వో


కోటగిరి : ఎక్లాస్‌పూర్ గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ


డిచ్‌పల్లి : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో


నవీపేట్ : దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న ఆర్డీవో

ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి

• శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి
• ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచి బలి తీసుకుంటున్న శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలోని శ్రీ చైతన్య కళాశాలలో యాజమాన్య ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను బలిగొంటున్న శ్రీ చైతన్యను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలలో వరుసగా ఆత్మహత్యలు జరుగుతున్నందున కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాలోని శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వ జీవోలను విస్మరించి సెలవుల రోజున విద్యాసంస్థలను నడపడం దారుణమని అన్నారు. దీనివల్లే విద్యార్థులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. మేడ్చల్ శ్రీ చైతన్యలో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని తల్లిదండ్రులకు ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు విశాల్, నాయకులు సందీప్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తు తేదీని పొడిగించాలి

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులకు అందించే ఉపకార వేతనాలు దరఖాస్తు తేదీని ప్రభుత్వం పొడిగించాలని ఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆయన మాట్లాడుతూ.. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలకు (స్కాలర్‌షిప్) సంబంధించిన అప్లికేషన్ల స్వీకరణ తుది గడువు ఈ నెల 31వ తేదీన ముగుస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం కుల, ఆదాయ సర్టిఫికెట్లకై తహసీల్దార్ ఆఫీస్‌లో అప్లై చేసినప్పటికీ రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ సర్టిఫికెట్లు అందలేదన్నారు. దాంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ సంవత్సరం నవంబర్ 30వ తేదీ జరిగిన ఎన్నికల వల్ల విద్యార్థులకు ఆదాయ సర్టిఫికెట్ల జారీ ఆలస్యం అవ్వడంతో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు చేసుకోవడానికి రెండు రోజులు మాత్రమే సమయం ఉండడంతో అటు డిగ్రీ పరీక్షలు జరుగుతుండడంతో విద్యార్థులు స్కాలర్షిప్ తుది గడువు ముగియడంతో ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. నేటి వరకు 2023-24 విద్యాసంస్థలకు గాను ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న మొత్తం విద్యార్థులలో 50 శాతం విద్యార్థులు మాత్రమే అప్లై చేశారన్నారు. మిగతా 50 శాతం మంది విద్యార్థులు తమ ఆదాయ, కుల ధ్రువపత్రాలు ఎమ్మార్వో ఆఫీస్ నుంచి ఆలస్యం కావడం మూలంగా ఇంకా దరఖాస్తు చేసుకోలేదని అన్నారు. కావున విద్యాశాఖ అధికారులు ఈనెల 31వ తేదీ స్కాలర్‌షిప్ అప్లికేషన్ తేదీని పొడిగించాలని డిమాండ్ చేశారు.

రెండవ రోజు 2800 దరఖాస్తులు


భవానీపేట్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్

నవతెలంగాణ-లింగంపేట్

ప్రజాపాల దరఖాస్తులకు స్పందన వస్తున్నట్టు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. తాజాగా శుక్రవారం రెండో రోజు 2800 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. శుక్రవారం లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ భవానిపేట్ ఒక పాటు ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా శాఖలకు చెందిన అధికారుల ఏర్పాటుచేసి లబ్ధిదారుల నుండి స్వీకరించారు. ఇప్పటివరకు రెండో రోజు 2800 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి ఆరు గ్యారెంటీలు మహాలక్ష్మి రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు చేయూత తదితర పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నారని అన్నారు. జనవరి ఆరో తేదీ వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

వివోఏ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి



తాడ్వాయి మండలంలో ఐకెపి వివోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ గౌస్ ఖాన్ ఆధ్వర్యంలో మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్ భాగ్య ఉపాధ్యక్షులుగా నవనీత, కార్యదర్శిగా గౌతమీ, సహాయ కార్యదర్శిగా సత్యం, కోశాధికారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా రాజేశ్వరి మోహన్ రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రజిత, రేణుక, షబానా, స్రవంతి, రవీందర్ రెడ్డి, బొంది రమేష్, మరి వివో ఏలు మీటింగ్ కు హాజరయ్యారు.